కన్నవారినెప్పుడు కాల దన్నకుండయ్య
పాప భారమేల వంశమునకు?
రత్నములను విడిచి రాళ్ళేరుకుందురా?
విశ్వ సూక్తి తరచి వినర చంద్ర
-చంద్ర ప్రతాప్ కంతేటి
సెల్:8008143507

వినేటప్పుడు వినయం
మాట్లాడేటప్పుడు మర్యాద
అడిగేటప్పుడు అప్యాయత
సమాధానం చెప్పేటప్పుడు సంస్కారం ఉంటే
అంతా సుఖాంతమే.
-రాధాకృష్ణ
సెల్:98481 28215


నేటినిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com website: www.netinijam.com




### ఘంటారావం

జూదం మీద
మోజు పడకు
దర్పరాజు
కథ మరువకు.

అమ్మదు పోయేవారిని
నమ్ముకున్నారా?
మొదటికి మోసమని
మరచిపోయారా?

అనుకూలతను అనుమానంతో
అద్దుకుంటే ఎలా?
ప్రతికూలతను అవివేకంతో
ప్రోత్సహించినట్లు కాదా..

సమస్యలకు తలవంచనివారు
సామనవీరులు
తరతరాలను వెలిగించే
తరగని సిరులు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



# ప్రపంచానికి తోడుగా ఓ కవితా సంకల్పం






జస్టిస్ బి చంద్రకుమార్ చేతిలోని కలంలో ఎప్పటికీ ఇంకు ఆయిపోదు. ఆ గలంలో నిత్యం, పోరాటాల కోసం పాట వెలువడు తూనే ఉంటుంది. ఆ భావాల కొలిమిలో మండే నిప్పురవ్వల మీద కవితల జననం జరుగు తూనే ఉంటుంది. సమాజాన్ని క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తూ సాహిత్యం కోర్టులో వెలువడే తీర్పుల్లో మనిషి మానసిక స్థితిని ఉత్తేజపరిచే నరికొత్త సూర్యకిరణాలు వెలువడుతూనే ఉంటాయి. ఆయన చేతుల్లోని రేఖలనిండా అన్ని అక్షరాలే. లక్ష్యం మాత్రం ఒకటే సులక్షణమైన జాగృతి చైతన్యం కోసమే. ఆయన వేసే ప్రతి అడుగు, దుర్భర పరిస్థితులు ఎంత భయంకరమైనా సరే, వాటిని తన భావాల బాణాలతో ఛేదిస్తూ భౌతిక విషయాల్లోకి మనిషిని తన వెంట నడిపించడమే కాదు, తాత్విక, ఆధ్యాత్మిక విషయాల లోతుల్లోని జ్ఞాన సంపదను ఆ మనిషికి సంపూర్ణంగా అందించే ప్రయత్నం లో జస్టిస్ బి. చంద్రకుమార్ అనేక గ్రంథాలను వెలువరించారు. ఆ క్రమంలో వెలువడిన మరో సాహిత్య ఆణిముత్యం 'ఎవరు నాకు తోడు' కవితా సంపుటి.

ఈ నేల మీద జన్మించిన మనిషికి కేవలం మనుషులే కాదు తోడు, నీ చుట్టూ ఉన్న ఎన్నో అంశాలు నీకు తోడుగా నిలబడే సిద్ధాంతాలకు కర్తలుగా సంతకాలు పెడుతున్నాయి. నువ్వు తాకితే చాలు, గాలి నిన్ను పలకరిం చడానికి సిద్ధంగా ఉంటుంది. నువ్వు కరచాలనం చేయగానే, నీ నీడలా నడవడానికి పత్రహరితం తన హర్షాన్ని ప్రకటిస్తుంది. నువ్వు ప్రేమగా తలెత్తి చూస్తే చాలు, ఆకాశం నేరుగా వచ్చి నీ అరచేతుల్లో ఇట్టే ఇమిడిపోతుంది. సముద్రాన్ని నీ నేత్రాలు ఆహ్వానిస్తే చాలు, నీ హృదయాన్ని సాగర విస్తీర్ణం చేసి, సద్గుణాల సంపదలకు నిన్ను స్థావరం చేస్తుంది. నడుస్తున్న నేలకు నువ్వు దండం పెడితే చాలు, బ్రతికిన కాలంలోనే కాదు, ఆ తరువాత సైతం నీకు తన ఒడిలో చోటు కల్పిస్తుంది. నిప్పు కాలుతుందని భయపడక దగ్గరికి చేరితే చాలు, ప్రశ్నించే ధైర్యాన్ని నీకు ఆస్తులుగా రాసి ఇస్తుంది. పక్షుల రెక్కలలోని ఈకల బలాన్ని గుర్తించగలిగితే చాలు, స్వేచ్ఛా సంకేతాల సాంకేతిక జ్ఞానం, నీ శక్తికి అదనపు బలమవుతుందని ప్రారంభ కవిత 'ఎవరు నాకు తోడు' మనకు బోధిస్తోంది. ఇజాలతో సంబంధంలేని ఏ నిజాల వస్త్రాల ను మనం ధరించాలో తెలియజేసే బాధ్యతను, ఈ కవితలోని ప్రతిపాదం తన పాత్రను గొప్పగా నిర్వహించింది.

అనాదికాలం నుంచి అతి పవిత్రంగా కొనసాగుతున్న విద్యను సైతం మార్కెట్లో వస్తువుగా మార్చి వ్యాపారం చేస్తున్న అనాగరిక వాస్తవాలను ఖండిస్తూ తన గొంతును వినిపించిన కవిత 'వినుర కుమార'. మోసాలకు అంతులేదు, శ్రమజీవికి బ్రతుకులేదు, సామా న్యుడికి శాంతిలేదు... అంటూ కొనసాగిన 'కరోనా కాటుకు బలవుదామా' కవితలో, సంపాదన గురించి, మోసాలను గురించి, అవినీతి అడ్డదారులను గురించి, అమాయకుల అవయవాలను కాజేసే దుర్మార్గాన్ని గురించి, భూ కాలుష్యం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యం... ఇత్యాది కాలుష్యాల గురించి.. ఈ కవితలో హెచ్చరికలు చాలా ఉన్నాయి. బడికి వెళ్లే పిల్లలు, బాలకార్మికులుగా మారినప్పుడు, ఆ బాల దేహాల నుంచి కారే శ్వేదాన్ని చూసి, కవి ఎంతగానో చలిస్తున్నాడు. కరోనాకు బలి కాకండి అంటూ అరచిన అరుపులు ఇంకా ఈ కవితలో వినిపిస్తూనే ఉన్నాయి.

ఎటుచూసినా కన్నీళ్లు, మోసా లు, హత్యలు, మానభంగాలు, మానవమృగాల వికృత చేష్టలు, పేదల ఆక్రందనలు, రైతుల ఆవేదనలు, నిరుద్యోగుల నిట్టూర్పులు... ఇంకా ఎన్నాళ్లు, ఎన్నాళ్లు... అంటూ అక్రమార్కుల్ని, అవకాశవాద పార్టీ ఫిరాయింపుదారుల్ని, పాలించలేక అణిచివేతకు సిద్ధపడుతున్న పాలకులను... దోషులుగా నిలబెట్టి కవి సూటిగా వారిని ప్రశ్నిస్తున్నాడు. అదే సమయంలో రేపటి భవిష్యత్తులో దీపావళి కాంతులు అందుతాయనే ఆశాభావాన్ని కూడా కవి వ్యక్తం చేస్తున్నాడు. ఒక వలస కార్మికుడు తన ఆకలి బాధను తట్టుకోలేక తన సెల్ ఫోన్ అమ్మి, ఆ డబ్బును తన భార్యకు ఇచ్చి, ఇక బ్రతికే మార్గాలు లేక ఆత్మహత్య చేసుకుని చనిపోతాడు. ఆ వార్త విని చలించిపోయిన కవి, తన అక్షరాలతో ఆ కార్మికుడికి హారతులి స్తూ, మన్నించి తన మాట వినమం టూ, ఆకలికి పరిష్కారం ఆత్మహత్య కాదంటూ, కుటుంబ సభ్యుల్ని అనాథలను చేయడం, నడిచేకాలం అసలు సహించదని, కన్నీళ్లు కలకాలం ఉండబోవని, వాస్తవాన్ని వలసకార్మిక మిత్రులంతా తెలుసుకోవాలని కవి చేసిన విన్నపం 'సోదరా ఓ సోదరా' కవిత నిండా మారుమ్రోగుతోంది. అక్కడో చెత్తకుండి, అందులో అప్పుడే పుట్టిన బిడ్డ, చీమలు, దోమలు, క్రిమి కీటకాల మధ్య గుక్కపట్టి ఏడుస్తున్న బిడ్డ.... ఆకాశం సైతం ఆ హృదయవిదారక దృశ్యాన్ని చూసి, బోరుమని ఏడుస్తోం ది. మరి మనుషులు ఎందుకు ఈ దుర్మార్గానికి సిద్ధపడుతు న్నారు?... అంటూ కవి ప్రశ్నిస్తున్న 'చెత్తకుండిలో బిడ్డ' కవితలో ఆ బిడ్డ కన్నతల్లి వేదనను కూడా తన కలంలో నింపి పాఠకులకు అందించిన విధానం, మనచేత కూడా కన్నీళ్లు కార్పించి మానవత్వాన్ని గురించి ఆలోచించే దిశ వైపు, మనం కూడా అడుగులు వేసేలా ఆదేశిస్తుంది ఈ కవిత.

ఈ కవితాసంపుటి రహదారుల్లో నడుస్తున్నప్పుడు అనుకోకుండా గలగలమంటూ ప్రవహిస్తున్న ఒక నది నడక మనల్ని ఎంతగానో ఆకర్షిస్తుంది. ఆగి ఆ నదిని తాకి చూశాను, ఆశ్చర్యం ఆ నీటి అలల నిండా కవి ముఖ చిత్రాలే కనిపిస్తున్నాయి. 'నదీ ప్రవాహం' కవితలో అక్షరాలు లేవు, అన్నీ కదులుతున్న నీటి బిందువులే. కాలం ఏదైనా మంత్రాలకు చింతకా యలు రాలవన్న నిజాన్ని మరోమారు ఢంకా భజాయించి, బయలుదేరిన 'మంత్రాల కు చింతకాయలు' కవితనిం డా అన్ని సత్యాల తోరణాలే దర్శనమి స్తున్నాయి. కులం, మతం, విషసంస్కృ తుల నిర్మూలన కోసం ఈ సంపుటిలో కవి తన కవితలతో ఒక యుద్ధాన్ని ప్రకటి స్తున్నాడు. కులాల పేరుతో, మతాల పేరుతో చేతులు నరకటం, సజీవ దహనాలు చేయటం, ప్రార్థనా మం దిరాలను కూల్చడం... ఏ శాస్త్రాలు బోధించడం లేదని, కేవలం మనుషుల వికృత ఆలోచనలే మత విద్వేశాలకు కారణమంటూ మరో మారు ఈ కవితలో గాడంగా గుర్తుచేస్తున్నాడు కవి.

ఈ సంపుటిలోని 'నేను చావలేదు' కవిత పాఠకుల్ని విశేషంగా ఆలోచిం పజేస్తుంది. ఈ కవితలోని భావవ్యక్తీక రణ పరిధిలు, ఆకాశం దాకా విస్తరించడం ఆనందాన్ని కలిగించిం ది. ఎన్నోసార్లు ప్రయత్నించినా అతడు చావడం లేదు. ఎన్ని పుస్తకాలు పఠించినా, ఎన్ని ఆశ్రమాలను సందర్శించినా, ఎన్ని గుడి, గోపురాల కు మొక్కులు తీర్చుకున్నా, అతడు చావటంలేదు. చివరికి ఇక్కడ కూడా అంతా ఆ శక్తేనని, అందరిలోనూ ఉ న్న ఒకే ఒక అంశం ఆ శక్తేనని తెలుసుకునే సమయం కోసం ఎదురు చూస్తున్నట్టు... ఈ కవిత తెరల మీద స్పష్టమైన ఒక దృశ్యం కనబడుతోంది. చినిగిన చొక్కా వేసుకొని తన కలనే కవితగా రాసుకుని, ఉగాది కవిసమ్మేళ నానికి బయలుదేరిన కవిని కాసేపు ఆపి, రాసిన కవిత గురించి అడిగాను. కవి తన కవితను నా చేతికి ఇచ్చాడు. అందులోనుంచి కాలుష్యం, ఆకలి చావుల దృశ్యాలు కనిపిస్తున్నాయి. వరకట్నం వేధింపులు, పోలీసుల కాల్పులు వినిపిస్తున్నాయి. కవి నేత్రాలనిండా నిప్పుకణాలు రాలుతు న్నాయి. 'జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయి, వస్తున్నాయి... భూమార్గం పటిస్తాను, భూకంపం సృష్టిస్తాను..' అంటూ పిడికిళ్ళు బిగించిన కవి, తన 'ఉగాది సమ్మేళనం' కవిత నిండా బిగ్గరగా సామాన్యజనం కోసం నినాదాలు చేస్తున్నాడు.

ఈ సంపుటిలో మళ్లీ మళ్లీ మనచేత చదివించే కవిత 'నేను వెళ్తున్నాను'. ఈ కవితలో ఆకాశాన్ని దాటుకుంటూ, చందమామకు వీడ్కోలు చెప్పుకుంటూ, సూర్యుడిని ఆస్వాదిస్తూ, చుక్కల్ని పలకరిస్తూ, గగనాంతరాలలోని గ్రహాలతో ఆడుకుంటూ, నేను వెళ్తున్నాను... అంటూ ఒక గొంతు వినబడుతోంది. ఎక్కడినుంచి వచ్చానో, అక్కడికే వెళ్తున్నాను... అంటాడు కవితలో. విషయం మనకు అర్థమైపోతుంది. ఇప్పుడు అతడికి ఏ కోరికలు లేవు. ఎవరితో ఏ సంబంధాలు లేవు. కోపం లేదు, తాపం లేదు, మొత్తం ప్రశాంతం. కవిత పూర్తయ్యాక 'కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది, కొత్తగా పుట్టేవాళ్ళు పుడుతూనే ఉంటారు. వెళ్లేవాళ్ళు వెళుతూనే ఉంటారు. రేపటి రోజు మనమూ ఇంతే...' అంటూ ఒక తాత్విక చింతన మన చుట్టూ ఒక పక్షిగూడులా అల్లుకుపోతుంది.

ఈ విశ్వంలో ప్రేమ ఎంత శక్తిమైనదో తెలియజేసే కవిత 'ప్రేమే కారణం'. కవి వ్యక్తం చేసినట్లు సమస్తానికి ప్రేమే మూలం. ఈ ప్రేమ, కోడికి, కోడి పిల్లలకు మధ్యన కూడా ఉంటుంది. తన పిల్లల రక్షణ కోసం కోడితల్లి తన ప్రాణాలను లెక్కచేయదు. అష్టకష్టాలు పడి అమ్మ, నాన్నలు తమ బిడ్డల్ని పెంచే నేపథ్యానికి ప్రేమే కారణం. ఈ కవిత చివరలో కవి ఒక అద్భుతమైన భావనను ఇలా అందిస్తున్నాడు. 'శాశ్వత విశ్రాంతినిచ్చే చావు రావడం, విశ్వ ప్రేమకు కారణం...' అంటాడు కవి. ఈ అక్షరాలలో ఉన్న సత్యాన్ని అవగాహన చేసుకుంటే, మరణానికి ప్రతిమనిషి తన ఆహ్వానాన్ని అందించే సందర్భం ఇది. చదివే పాఠకుడి నేత్రాలనిండా భక్తి భావాన్ని రాసులు, రాసులుగా నింపే కవిత 'కత్తిపట్టని- ప్రపంచ విజేత'. గౌతమ బుద్ధుడి స్వరూపాన్ని చాలా శక్తివంతంగా చిత్రీకరించిన కవిత ఇది. ఆయన సంకల్పం, కార్యశీలత, చిత్తశుద్ధి, ఖండాంతరాలలో మారుమ్రోగిన ఆయన ఖ్యాతి, సునిశిత పరిశీలన, పంచసూత్రాల నిర్మాణం, అఖండమైన వెలుగుతో ప్రకాశించిన ఆయన ఆచరణ, బోధనలు... ఇంకా, ఇంకా అనేక విషయాల ప్రస్తావనలతో ఒక దీపంలా వెలిగిన కవిత ఇది. ఈ సంపుటిలో కులం కుంపటి మీద కవి ఎక్కుపెట్టిన బాణాలు చాలా సూటిగా లక్ష్యాన్ని చేరుకున్నాయి. సైనిక కవాతులా కదంతొక్కిన 'భరత వీర లేవరా... నవ భారతం నిర్మించరా' అన్న నినాదాలు నాలుగు దిక్కులలో వినిపించడం, కవి చేతిలోని కలం బలానికి సాక్ష్యంగా నిలుస్తోంది.

కవి జస్టిస్ చంద్రకుమార్ తన అపారమైన జీవిత గమనంలో అసంఖ్యాకమైన విషయాలను అధ్యయనం చేసిన మేధావి. నిక్షిప్తమైన తన ఆలోచనల్ని అక్షరాల రూపంలోకి మార్చి, కవితల పందిళ్ళకింద వాటికి ఒక శాశ్వత నివాసాన్ని ఏర్పాటుచేసి, పాఠకుల చేత కరచాలన ఉత్సవాలకు తెరతీయించిన సాహితీవేత్త ఆయన. ఆ కలం నుండి రాలిన ప్రతి అక్షరం ఒక లక్ష్యాన్ని, ఒక ప్రయోజనాన్ని, ఒక సందేశాన్ని మోసుకురావడం, ఈ కవిత సంపుటి ప్రత్యేకత. కవిత్వాలనిండా ఆధునికత తొణికిసలాడిన ఈ కవితా సంపుటిలో, మనిషి పుట్టుక, మరణాల మర్మాలు తమ రెక్కలు ఇప్పుకుని మనతో సంభాషిస్తాయి. గాలి, వెలుతురు, నిప్పు, నీరు, భూమి... ఈ పంచ స్వరూపాలతో ముడిపడిన మానవుడి మనుగడ మన గడపల ముందు ముగ్గులేస్తూ కనపడుతుంది. వర్తమానంలో జీవిస్తూ, వాస్తవంగా ఆలోచించమన్న వాక్యాలు ఆభరణాలై మన బ్రతుకు కంఠాలకు అలంకరించబడతాయి. ఎన్నో ఉపయుక్తమైన గ్రంథాలను తెలుగుజాతికి అందించిన జస్టిస్ చంద్రకుమార్, మరోసారి మానవాళికి అవసరమైన ఔషధాన్ని కవితల రూపంలో అందివ్వడం, తెలుగు సాహిత్యానికి పండగరోజు పట్టుచీరను బహుకరిం చినట్టుగా ఉంది. కవి చంద్రకుమార్ ఒక శాశ్వత సాహిత్య గుర్తింపుకు వాం సుదైనందుకు మనసారా మన మంతా ఆయనకు అభినం దనల మందారాలను అందజేద్దాం.

**ప్రతులకు:**
జస్టిస్ బి. చంద్రకుమార్
8-7-55/బి/2, రోడ్ నెం.3, శిరిడీసాయి
నగర్ కాలనీ, హస్తినాపురం సెంట్రల్,
నాగార్జునసాగర్ రోడ్ దగ్గర
హైదరాబాద్-500 079
సెల్: 7997484866



-డా. కె.జి. వేణు,
98480 70084

# నిఖిలేశ్వర్ ఆత్మకథ "నిఖిలలోకం' ఆవిష్కరణ

"స్వతహాగా సౌమ్యుడైన నిఖిలేశ్వర్ తన అభిప్రాయా లను వ్యక్తం చేయడంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన కవిగా పరిణా మం చెందే కాలం, ఆ తర్వాత జీవితాన్ని 'నిఖిలలోకం' ద్వారా చాలా బాగా పరిచయం చేశారని అభినందిం చారు. ఆనాటి దిగంబర కవుల్లో ఒకరైన నిఖిలేశ్వర్ ఆత్మకథ 'నిఖిలలోకం', 'సాహిత్య సంగమం' వ్యాస సంపుటి పుస్తకాలను ఆదివారం శివం రోడ్డులోని ఓ హోటల్‌లో మరో దిగంబర కవి నగ్నముని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిఖిలేశ్వర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుగూ దిగంబర కవులను చూసి, వాళ్ల కవిత్వం చదివి తాను ఉత్ప్రేరకాన్ని పొందానని చెప్పారు. 'సాహిత్య సంగమం' సంపుటి ద్వారా 32 మంది సాహితీవేత్తలతో పాటు ముగ్గురు కమ్యూనిస్టు యోధుల జీవితాల మీద విశ్లేషణను చదవవచ్చని డా॥జతిన్ పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ 'నిఖిలలోకం'లో నిఖిలేశ్వర్ రాయాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. వాటిని రెండో భాగంగా అయినా రాయాలని సూచించారు. ప్రముఖ కవులు, రచయితలు డా॥నందిని సిధారెడ్డి, ఓల్గా, తెలకపల్లి రవి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, మానవ హక్కుల వేదిక జీవన్ కుమార్, ఎమెస్కో, ఎడిటర్ డి. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు నిఖిలేశ్వర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దిగంబర కవిత్వంలోనూ విప్లవ రచయితల సంఘంలో ఆయన తనదైన పాత్ర పోషించారని ప్రశంసించారు.



'నిఖిలలోకం', 'సాహిత్య సంగమం' వ్యాస సంపుటి పుస్తకాల ఆవిష్కరణలో నగ్నముని, కె. శివారెడ్డి, నిఖిలేశ్వర్

# అడిగోపుల పూరిస్తున్న "కొత్తగాలి"

పుస్తక సమీక్ష






అడిగోపుల వెంకట రత్నమ్ సీనియర్ కవి మాత్రమే కాదు.. సీరియస్ కవి కూడా. కవన సృజన ఆయన దృష్టిలో ఓ తపస్సు లాంటిది. నిత్య కవితా వ్రతుడైన అడిగోపుల తన సాహిత్య ప్రస్థానంలో యిప్పటికే 26 కవితా సంపుటాలు వెలువరించిన కవి. కొన్ని గ్రంథాలపై నేను సమీక్షా వ్యాసాలు కూడా రాసినట్టు గుర్తు. యిప్పుడు తాజాగా 62 కవితలతో **'కొత్తగాలి'** పేరిట అభ్యుదయ కవిత్వాన్ని పూరిస్తున్నాడు. వెంకట రత్నమ్ కవిత్వంలో మానవతావాదం, సమాజ పరిశీలన, ప్రకృతి వర్ణన, పీడితుల వేదన ప్రస్ఫుటంగా వెలుగులీనుతై.

'కొత్తగాలి' అంటే ఏమిటి? ఎప్పుడూ వుండే గాలేగా.. కొత్తగా వీచడమేమిటి? ముఖచిత్రం చూడగానే కవితాత్మ గోచరమవుతుంది. దుప్పులు (జింక పిల్లలు) సమూహంగా వెంటబడి తరుముతుంటే ఓ పులి తోక ముడిచి పారిపోతుంటుంది. అణగా రిన వర్గం ఏకమై తిరగబడితే దోపిడీ దారుడు ఖిన్నుడై నిష్క్రమిస్తున్న దృశ్యం తళుక్కుమంటుంది.

**ఒకానొక దౌర్జన్యం**
**బీభత్సమై బంధించి**
**నిలువు దోపిడీయై నగ్నంచేసి**
**సమస్తం తానై చక్రంతిప్పి**
**సూర్యాస్తమయాలు చేజిక్కి**
**దారులన్నీ మూసుకున్నాక**
**మార్గావిష్కరణే కొత్తగాలి!**

అంటు ఆవిష్కరిస్తాడు కవి. దారు లన్నీ మూసుకుపోయి నాల్గు గోడల మధ్య బందీ అయిన పిల్లి ఏమవు తుంది? పులి అవుతుంది అని కవి భావన.

మరో అడుగు ముందుకేసి
**"చూపులన్నీ మసకేశాక**
**క్రాంతి కావడమే కొత్తగాలి!**
**మాటలన్నీ మూగబోయాక**
**గర్జించడమే కొత్తగాలి!"**
అని వివరణ యిస్తారు అడిగోపుల.

**"కవితా వస్తువును వెతుక్కుంటూ**
**నగరం కూడలిలో నిల్చున్నాను"** ఆయన కవితా సృజనకు సమాజ దర్శనమే ప్రేరణ అంటున్నాడు కవి.

**"దోసిలి భిక్షాపాత్రచేసి**
**ఓ స్త్రీ నా ముందు పెట్టింది**
**నన్ను సూటిగా చూసిన చూపు**
**కుడి ఎడమలకు మళ్లి**
**నేలపై పరుచుకుంది**
**తడిసీ తడవని కన్నీరు**
**కనుల రెప్పలపై తారాడింది"** యిదీ కవికి ఎదురైన దృశ్యం. మరి కవి ఏం చేస్తున్నాడు.

"చూపులలో రంగుల్ని **కవిత్వీకరి స్తున్నాను!"** అంటున్నాడు. మన చుట్టూవున్న సమాజం ఓ పెద్ద వస్తు భాండాగారం. చేదుకోగలగాలే గాని కావల్సినంత వస్తు సంపద అందు తుంది. వెంకటరత్నమ్ ఆ పనే చేస్తున్నాడు. అందుకే స్త్రీ, శిశు వు, పంచేంద్రియాలు. ప్రకృతి, భౌతికత, పల్లెసీ మలు, వంటి వస్తువులు ఆయన కవిత ల్లో కవితాత్మకంగా ఒదిగిపోతాయి. కవితలన్ని చదివింతర్వాత ఓ మానవ తావాదిగా, మార్క్సిస్టుగా. అభ్యుదయ వాదిగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా వివిధ రూపాల్లో వ్యక్తమవుతుంటాడు అడిగోపుల.

ఉంటున్న చోటును వదిలి భుక్తి కోసం దేశ సంచారం చేసే అభాగ్యుల జీవితాల్లో ఎన్ని జీవితాలు ఉదయించి నా మారని గమనం వారిది అంటాడు.

**"ఎన్ని ఉగాదులు పలకరించి వెళ్ళినా**
**ఎన్ని ఉదయాలు ఉదయించి వెళ్ళినా**
**ఉదయించని వెతలవారు!"**
కరోనా కావొచ్చు. కరువు కావొచ్చు వరదలు కావొచ్చు. కారణం ఏదైనా బతకడానికి నిస్సహాయులై దేశ సంచారానికి నాంది పలుకుతారు. దారీ తెన్నులేని ప్రస్థానం ఆ అభాగ్యులది.

**"ఆచ్ఛాదన లేని పాదాలు**
**ఇనుప తొడుగులై**
**ముళ్లపై నిర్భయంగా నడుస్తాయి**
**అడవి తల్లి దీవెనంటూ**
**రంగు రంగు దారాలు**
**మణికట్టుపై ముడివేసి**
**కొండ దేవత ప్రసాదిత**
**గాజులౌతాయి!"** బతుకు పోరును దృశ్యమానం చేసిన తీరు యిది.

ఎవరైనా ఆత్మీయంగా ఆలిం గనం చేసుకుంటే ఎంత హాయిగా వుం టుందో ఊహించుకోండి. ఆ రెండు గుండెల భాషామృతం వర్ణనాతీతం. మానసిక రుగ్మతకు దివ్య ఔషధంలా పనిచేసే స్పర్శఅది.

**"స్పర్శ..ఒకసారి మాట**
**ఒకసారి మౌనం**
**ప్రతిసారి ఔషధం"** అంటున్నాడు కవి. ఒక్కో రుగ్మతకు ఒక్కో ఔషధాన్ని సూచిస్తున్నాడు.

మానవ సంబంధాలు మృగ్యమ వుతున్న రోజులివి. అహం, స్వార్థం, ఈర్ష్య మనుషుల మధ్య దూరాన్ని పెంచడమేగాదు మనసుల మధ్య అగాధాన్ని సృష్టిస్తున్నాయి.

**"మనుషుల మధ్య మాటకరువై**
**కలయిక లుండవు**
**"ఊళ్ళమధ్య దారులు శూన్యమై**
**సంబంధాలు మృగ్యం**
**అమ్మ ఒడిలో నడక నేర్చనివాడు**
**ఆకాశంలో దారులంటాడు**
**శూన్యంలో పరుగులంటాడు**
**గ్రహాలపై దౌడులంటాడు"** మసక బారుతున్న మానవ సంబంధాల పట్ల కవి ఆవేదన.

**"చేతులెత్తి నమస్కరించే**
**అర్థించిన వాడి చేతులెంత నొప్పో**
**అర్థి అందుకున్న చేతులకు**
**తెలియదు!"** ఇదీ సమాజంలోని నేటి దుస్థితి. పాలకుల మనోస్థితి. వృద్ధాప్య మంటే బాల్యంలోకి ఒదిగిపోవడమే. మనకు తెలీకుండానే చిన్న పిల్లలమై పోతాం.

**"పట్టు తప్పిన మూత్రం**
**మంచం క్షేత్రమై**
**పంచెను ముంచెస్తే**
**పడక ముఖమల్ గుడ్డపై**
**యధేచ్ఛగా బిడ్డ**
**జారవిడిచిన మూత్రం చూసి**
**బంగారం చిచ్చు పోశాడంటూ**
**తల్లి మురిపాల ముద్దుచేసిన**
**బాల్యం గుర్తొస్తుంది"** యిలా వృద్ధాప్యాన్ని బాల్యానికి అన్వయిస్తు రాసిన చిలిపి కవిత **"బాల్యం గుర్తొస్తుంది"**.

**"బాల్యానిది వృద్ధాప్యంపై**
**హ్రస్వదృష్టి**
**వృద్ధాప్యానిది**
**బాల్యంపై**
**దూరదృష్టి"** అడిగోపుల కవిత్వం లో క్లిష్టత వుండదు. భాష సరళం.. భావం మధురం.. రవాణా ఖర్చులకు 20 రూపాయలు చేతిలో లేక కాలినడకన మోయలేని స్థితిలో బిడ్డతో అరవై కిలో మీటర్లు అడుగులు వేస్తు వెళ్ళిన తండ్రికి నిరాశే ఎదురవుతుంది. ఇరవై నిముషాలు ముందొస్తే **'బిడ్డకు నూకలు నిండేవి కావు'** అంటారు ఆసుపత్రిలో వైద్యులు. శవాన్ని యింటికి జేర్చాలి. ఎలా? ఇరవై వేలు చార్జి అడుగుతారు అంబులెన్స్ సారధులు.

**"ఆసుపత్రి కనువిప్పదు**
**అధికారం నోరు విప్పదు**
**చోదకులదే పాలన**
**సారధులదే శాసనం!"**
**"ఇదీ నడుస్తున్న భారతం"** అంటాడు వెంకటరత్నమ్. ఇటీవల ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యం.

**"వాహ్యాళి చెయ్యడమంటే**
**కేవలం శరీర విహారం కాదు**
**మనస్సులో సంగీతం మోసుకురా**
**వటం"** వంటి సరిగమల్ని చాలానే వినిపిస్తాడు ఈ కవి. **"ప్రయాణంలో పదనిసలు"** కూడా ఆస్వాదిం చవచ్చు. వృద్ధాప్యాన్ని తాత్విక దృష్టితో దర్శిస్తాడు కవి. రంగు మారిన కిటికీల్తో ఊడిపడపోయే ద్వారాలతో, బూజు పట్టిన గోడల తో శిధిలావస్థకు చేరుకున్న ఇంటితో పోలుస్తాడు. ముఖంమీద అలలు అలలుగా తేలిన ముడతల నుండి అనుభూ తుల్ని, అనుభవసా రాన్ని పిండుకోవాలని పిలుపునిస్తాడు.

**"ఒకటి నిశ్చలం**
**ఒకరు చలనం**
**జరిగిన ప్రస్థానంలో**
**కరిగిన చరాచరాలు**
**పరిణామ దశలు"** అంటు తేల్చేస్తాడు. కవితా నిర్వహణలో Take off ఒక ఎత్తయితే.. Landing మరో ఎత్తు. యివి రెండూ చక్కగా అమరితే కవిత పండుతుం దనడంలో సందేహం లేదు. ఈ రహస్యం బాగా తెలిసిన కవి అడిగోపుల. ఆయన కవితల్లోని కొన్ని ముగింపు పంక్తుల్ని గమనిద్దాం.

**"ఒక నమ్మకం నడిపిస్తుంది**
**ఒక ఆశ వెంట నడుస్తుంది"**
**"మనిషి మతమైతే/ మట్టి మత్తేవుతుంది"** **"భూమిని బంతిని చేసి ఒకడు ఆరు బయట ఆడుకుంటు సూర్యుని దీపం చేసి ఒకడు ఇంట వెలిగించుకుంటూ"** **"నీరు సుఫల దారి.. ఎడారి జీవుల నోరెండి దోసిలి పట్టి వేడు కుంటే.. ఒయసిస్సై ప్రత్యక్షమౌ తుంది"**
**"కర్తది బరువు.. కర్మది భారం**
**క్రియది విషాదం"**
**'మాటల్లేని చూపులు మాట్లా డుకుంటాయి**
**మౌనాలు ఓదా ర్చుకుం టాయి"** యిలా ఏరుతూ పోతూ Quotable quotes చాలానే వున్నాయి. అడిగోపుల వెంకట రత్నమ్ కవిత్వ పఠనం ఒకచక్కని అనుభవం. అనుభూతి మయం.

ప్రతులకు: అడిగోపుల వెంకటరత్నం, కావేరి రెసిడెన్సీ
అరబిందో మార్గ్, ఎన్‌జిఓ కాలనీ, తిరుపతి-517 507. ఏ.పి.
సెల్: 98482 52946



**- రమణ వెలమకన్ని**
సెల్: 9866015040

## నీవు సల్లగుండాలె

**(వచన కథా కావ్యం-29)**



యూతంటే
చేతులూపుకుంట తిరుగుడు గాదు
సెల్ ఫోన్ల మూతులు వెట్టుడు గాదు
అయ్యమ్మలను బెదిరిచ్చి
అనుకున్నది సాధించుకునుడు గాదు..
కటకం లేని కంటితో
కపటం లేని మనసుతో
తన వాళ్లను చూసుకునుడు;
తనను తాను దెలుసుకునుడు;
అది లేకనే
వాళ్లు ఆగమై కుటుంబాలను ఆగం చేస్తున్నరు!
స్మార్ట్ ఫోన్ల వేట కొడవళ్లకు
బలైపోతున్నరు
బద్ధకం బురదల కూరుకపోతున్నరు
నడిస్తే కాళ్ళు గుంజుతయ్
పనిచేస్తే నడుములు గుంజుతయ్
పెండ్లి చేస్తే బతుకు ముండ్లకంపైతున్నది
సంపాదన పేరుతోని
దేశాలు పట్టుకొని తిరుగుతున్నోళ్లే నయ్యం
ఎందుకంటే
వాళ్ల గోసను చూసే దరిద్రం లేదు గద!
ఒగ పెద్ద మనిషి సలహాతో
ఊళ్ళ పంచాయతీ ఆఫీసుల
గ్రంథాలయం పురుడుబోసుకున్నది!
యువత పక్క తోవలను మూసుకున్నది!!
ఆ పెద్దాయన 'సల్లగుండాలె' అని
సరయు లెక్కలేనన్నిసార్లు అనుకున్నది...



-దోరవేటి
సెల్:9866251679

## ఇంకొన్నాళ్ళు నను ఉండనీయండి

కండ్లు తెరిస్తే
నీ కిరణాలు జొరబడి
నా కలల లోకాన్ని
మాయంచేస్తాయన్న భయం ..
కలల దారుల్లో వెతుకున్న స్వప్న
సౌధాలను కూల్చి ఇలలో వెలిసే
అపశృతి జీవిత దృశ్యాల భీతి?,
అయినా?..

ఇంకొన్నాళ్ళు నన్ను నీ వెచ్చని నీడలో
ఉండనిస్తావా నా నేస్తమా సూర్యా..,
నీ పసిడి కిరణాలను నా శరీరం
మూటకట్టుకుని మురిసిపోనీ?!

నీ పచ్చని పొత్తిళ్ళలో నను పొదుముకుని
పెంచావు ..ఇంకొన్నాళ్ళు తనివితీరా
నీ చల్లని నీడలో నను తరించనీ చెట్టుతల్లీ..,
ఇలలో నీ ఋణము తీర్చే మార్గమేదీ??!

నీ ప్రేమ జల్లులో నను ఇంకొన్నాళ్ళు తడిసి
మురిసి ముద్దైపోనీ మిత్రమా వరుణా..,
నేలతల్లి తడిఒడిలో మేలుకొనే మొలకలతో
నను కాసేపు ప్రేమతో ముచ్చటించనీ?!

నా మనసు పొరల్లో మీ ప్రేమ గింజలను
పదిలంగా దాచుకుని జన్మజన్మలూ తిరిగి
నాటుకుంటూ కాసిన ఆ ప్రేమ విత్తులను
నలుగురుకి పంచుకూంటూ పయనిస్తాను..
ఇంకొన్నాళ్ళు నను ఇక్కడ ఉండనీయండి..!!



**-డా. పి. విజయలక్ష్మి పండిట్**
సెల్:8639061472

## బంజారా నానీలు



గగనానికి లంబాడీలు
ఘుగరా అతికించారు
ఇంద్రధనస్సంటే
అదే..



**-డా॥ సూర్యాధనంజయ్**
సెల్:9849104187



పెప్సీలెందుకు
పనికొస్తాయి
యాడి వండిపెట్టిన
లాప్సీ ముందు?

## తెలుగును వెలిగించు...

అమృతమే తెలుగు
అద్భుతంగా అంతటా సంభాషించు
అజరామరం తెలుగు
ఆత్మబంధువువై పరిరక్షించు
ప్రామాణిక రూపమే తెలుగు
అనుశీలతతో పరిశోధించు
అనుబంధాల వేగుచుక్క తెలుగు
విశాలత కలిగిన క్రియాశీలిగా భావించు
విజ్ఞానాల కదంబం తెలుగు
అజ్ఞాత శూన్యం తొలగిందని గుర్తించు
సామాజిక చైతన్య స్వరూపం తెలుగు
అసలైన మూలధనం అదేనని ప్రకటించు
పీడనపై ఎలుగెత్తిన అక్షర బావుటా తెలుగు
సార్వకాలిక యదార్థమదేనని వివరించు
జనామోద ప్రతిబింబమే తెలుగు
తరతరాలకు ఆ శోభను విస్తరించు
వెలిగించు తెలుగును
విస్తరించు భాషాదీపికను
ప్రసరించు కీర్తి చంద్రికలను....



**- డా. తిరునగరి శ్రీనివాస్**
8466053933

# ఒడిస్సా కవిత్వం

సాహితీ స్రవంతి

-వారాల ఆనంద్
9440501281





ఒడిస్సా అనగానే అందరి మనుసుల్లో తళుక్కున మెరిసేది 'జగన్నాథుడు', ప్రతి ఏటా జరిగే 'జగన్నాథ రథ యాత్ర' గుర్తొస్తుంది. అంతేకాదు ఒడిస్సా అనగానే మనకు కోణార్క్ దేవాలయం కవిపిస్తుంది. వాటి తోడు ఒడిస్సీ నృత్యమూ మదిలో మెదుల్తుంది. వీటన్నింటి తోపాటు దృశ్య మాధ్యమం మీద ఆసక్తి వున్నవాళ్లకు గొప్ప సినీ దర్శకులు నీరద్ మహాపాత్ర, మన్మోహన్ మహాపాత్ర, ఏ.కె.బీర్, ఒడిస్సాకే చెందిన ఆర్టిస్ట్ జతిన్ దాస్, ఆయన కూతురు నందితా దాన్ లు గుర్తొస్తారు. ఇంకా చిలికా సరస్సు లాంటివి అనేకం కళ్ల ముందు కదలాడతాయి

అయితే ఒడిస్సా అని ప్రస్తుతం పిలుచుకుంటున్న ఒరిస్సా లో భాషా సాహిత్యాలూ అంతే ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. భారతీయ భాషలన్నింటిలో ఒడియా కూడా విలక్షణమయిన స్థానాన్ని పొందింది. ఒడియా సాహిత్య ప్రపంచంలో కవిత్వం వచనం రెండూ విలసిల్లాయి. కవిత్వాన్ని గురించే మాట్లాడుకుంటే ఒడియాలో 4వ శాతాబ్దం నుంచే సాహిత్య సృజన వుందని అది శాసనాల్లో వుందని చరిత్రకారులు చెబుతారు. అయితే ఒడియా కవిత్వం మొట్టమొదటిసారిగా 10శతాబ్దం లో విలసిల్లిందని అది కూడా బౌద్ధ మిస్టిక్ వర్సెస్ లో వున్నాయని భావిస్తున్నారు. తర్వాత 15వ శతాబ్దం లో సరళాదేవి రాసిన మహాభారత రచన తో ఒడిస్సా కవిత్వంలో పరిపక్వత పూర్ణత్వం కనిపిస్తుంది. ఇక ముఖ్యంగా 14 నుంచి 18వ శతాబ్దాల నడుమ ఒడియా భాషలో కావ్య రచన, పురాణాలు, భజన్స్, చంపూ రచన్లు, చాస్టీసెస్, చాందాస్ లాంటి పలు రూపాల్లో కవిత్వ రచన సాగిందని చెప్పుకోవచ్చు.

మధ్యయుగాల్లో ఒడియా కవిత్వం ప్రధానంగా రాజుల నీడన, జానపదుల్లో బతికిందనే చెప్పాలి.

ఆధునిక ఒడియా కవిత్వ విషయానికి వస్తే శ్రీ రాధానాథ్ రాయ్ ప్రధాన మయిన కవిగా చెప్పుకోవాలి. మధ్యయుగానికి చెందిన ఒరవడినుంచి తొలగి భిన్నమయిన సృజనాత్మకతను చూపించిన వాడు ఆయన. సరికొత్త జాతీయాలు, అంతే కొత్త ధోరణిలో ఆయన కవిత్వం సాగిందనే చెప్పాలి. దానికి ప్రధాన కారణం ఆయన తరం మొట్ట మొదటిసారిగా పాశ్చాత్య విద్యను నేర్చుకోవడం, అక్కడి సాహిత్య పరిచయం రాయ్ కవిత్వ ధోరణికి ప్రధాన కారణమని చెప్పుకోవాలి. ఆ కాలంలో ముఖ్యంగా స్వాతంత్ర ఉద్యమం ప్రధాన అంశంగా సాగిందా రచన.

రాధానాథ్ రాయ్ రాస్తున్న కాలంలోనే ఆయనకు సమాంతరంగా ఒడియా కవిత్వ రంగంలో చెప్పుకోదగ్గ సృజన చేసిన వారు మధుసూదన్ రావు, గంగాధర్ మెహెర్, నందకిశోర్ రాయ్, ఫకీర్ మోహన్ సేనాధిపతి లు ముఖ్యమయినవారు. వారిలో మధుసూదన్ రావు ఆధ్యాత్మిక గేయాలు, దేశభక్తి గేయాలు విరివిగా రాశారు. ఆయన రచనల్లో సంస్కృత



ఒరవడి బాగా కనిపిస్తుంది. ఇక గంగాధర్ మెహెర్ తన రచనల్లో రామాయణ భారత భాగవతాది గ్రంధాల్లోంచి భావాల్ని కథల్ని తీసుకుని మంచి నిర్మాణాత్మక రూపంలో తన రచనలు చేశారు. సేనాపతి రచనల్లో సాధారణ జన జీవితాల్లోంచి, జానపద గాధల్లోంచి వివిధ అంశాల్ని తీసుకుని సాధారణ ప్రజల భాషలో రాశారు.

ఇక 20 వ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాల్లో ఒడియా కవిత్వ రంగంలో 'సత్యబాది' పేర ఏర్పడ్డ సాహిత్య సమూహం ఒడియన్ సాహితీ రంగంలో ప్రధాన పాత్రను పోషించింది. సత్యబాది ముఖ్యంగా జాతీయత, దేశ స్వాతంత్రం తదితర మయిన వాటిని ప్రధాన అంశాలు చేసుకుని కృషి చేసింది. అందులో గోపాబందుదాన్ నాయకుడిగా వున్నారు. ఆ తర్వాత మరొక సాహిత్య సమూహం ఒడిస్సా కవిత్వ రంగంలో వెలుగు చూసింది. అది 'సబుజ' అంటే ఆకుపచ్చని అని అర్థం. ఆ వర్గం ప్రధానంగా బెంగాలీ సాహిత్యం, పాశ్చాత్య సాహిత్య ప్రబావాలతో పని చేసింది. సరికొత్త థీమ్స్ తో, సరికొత్త రూపాల్లో వారి సృజన కొనసాగింది. అప్పటికి ఒడిస్సా లో విద్యావేత్తలు, సాహిత్యం చదివేవారి సంఖ్య తక్కువగానే వున్నప్పటికీ ఆ నాటి కవిత్వానికి గొప్ప ఆధారణనే లభించింది. ఆనాటి కవుల్లో ప్రముఖంగా చెప్పుకుంటే మాయాధర్ మానిసిన్హా, రాధా మోహన్ గొడనాయక్, గోదావరిష్ మహాపాత్ర, అనంత పట్నాయక్, సచ్చిదానంద రౌత్రాయ్ లు స్వాతంత్రానికి ముందు తర్వాతికాలంలో అంటే 1947 కు ముందు అనంతర కాలంలో ప్రధాన కవులుగా పేరెన్నిక గన్నారు.

మానిసిన్హా, గడనాయక్ లు గేయాలు, సొన్నెట్స్, బాలేలు రాశారు. మానిసిన్హా రచనల్లో ధూప(పవిత్ర జ్వాల), గడనాయక్ రచనల్లో స్మరణిక(జ్ఞాపకాలు) ప్రముఖమయినవి. గొప్ప పేరు తెచ్చుకున్నాయి. ఇక గోదావరిష్ మోహపాత్ర సామాజిక రాజకీయ వ్యంగ్య రచనలకు ప్రాధాన్యత నిచ్చారు. ఆయన ఒడియా కవిత్వానికి సరికొత్త దృక్కోణాన్ని ఇచ్చారనే చెప్పాలి. ఇక అనంత పట్నాయక్ ఆధునిక కవిత్వం లో గొప్ప ప్రయోగాలు చేశారు. భాషలో, రూపంలో కూడా. ఆయన తీసుకున్న విషయాల్లో ముఖ్యంగా మార్క్సిజం, తర్వాత స్వాతంత్ర పోరాట ఆశలు వైఫల్యం చెందడం లాంటివి ప్రధానంగా వున్నాయి.

ఇక ఒడిస్సాలో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న శ్రీ సచ్చిదానంద రౌత్ రాయ్ రాసినంత విస్తారంగా ఆధునిక కాలంలో మరెవరూ రాయలేదనే చెప్పాలి. ఆయన తన రచనలతో ఒడియా ప్రజల్ని ఉప్పెనలా చుట్టేశారు. ఆయన 1943 లో రాసిన దీర్ఘ కవిత 'బాజీ రౌత్' గొప్ప రచన. బ్రిటిష్ వారి తుపాకీ దెబ్బలకు బలయిన ఒక నావిక యువకుడి గాధ ఇది. తర్వాత ఆయన 20 కి పైగా కవితా సంకలనాల్ని వెలువరించారు. ఆయన రాసిన 'పల్లిశ్రీ' గ్రామీణ జీవితాన్ని అద్దం పట్టింది. ఇక 'ప్రతిమానాయక్' లో నగర యువతి ఎదుర్కొంటున్న కష్టాల్ని వేదనల్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు.

యువకుడిగా మార్క్సిజాన్ని అభిమానించిన రౌత్ రాయ్ ఇటీవల జగన్నాథుడి పైన కవిత్వం రాశాడు.

ఆ తర్వాత గురుప్రసాద్ మోహన్తి, రమాకాంత్ రథ్, సీతాకాంత్ మహాపాత్ర, జగన్నాద్ ప్రసాద్ దాస్, సౌభాగ్య కుమార్ మిశ్రా, దేవదాస్ చౌత్రాయ్, రాజేంద్రకిషోర్ పాండా, హర ప్రసాద్ దాస్, ప్రవాసిని మహాకుద్ తదితరులు ఆధునిక ఒడియా కవిత్వ రంగంలో కృషి చేస్తున్నారు.

గురుప్రసాద్ మోహంతి 'కాల పురుష్' ఆధునిక ఒడియా కవిత్వంలో ఒక మలుపు అనే చెప్పాలి అది టీ.ఎస్.ఇలియట్ వేస్ట్ లాండ్ ప్రభావంతో రాసినదే అయినప్పటికీ స్వతంత్ర రచనగా నిలబడింది.

సచ్చిదానంద రౌత్ రాయ్ తర్వాత రామకృష్ణ రథ్ కవిత్వం ఒడియాలో అత్యంత ప్రభావ వంత మయిందిగా చెప్పాలి. ఆయన రచనల్లో ఒంటరితనం, ధుఃఖం మరణం తదితర అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. తర్వాత సీతాకాంత్ మహాపాత్ర వర్తమాన ఆధునిక జీవితాన్ని తనదయిన ఒరవడిలో సరికొత్త శైలి లో రాసిన వాడు. రథ్ సరస్వతి సమ్మాన్ పురస్కారాన్ని , సీతాకాంత మహాపాత్ర జ్ఞానపీఠ్ పురస్కారాల్ని



పొందారు.

ఇంకా జగన్నాథ్ ప్రసాద్ దాస్, సౌభాగ్య కుమార్ మిశ్రా, రాజేంద్ర కిషోర్ పాండాలు భాషలోనూ భావాల్లోనూ తమదయిన ఒరవడిని నెలకొల్పారు. ఇంకా మరి కొంతమంది ముఖ్యమయిన కవుల గురించి చెప్పుకుంటే చౌత్రోయ్,హరి హర్ మిశ్రా, బ్రజానాథ్ రథ్, సౌరీంద్ర బరిక్, నృశింగా కుమార్ రథ్, ప్రసన్నకుమార్ మిశ్రా, హర ప్రసాద్ పరిచేయా పట్నాయక్, ఫణి మొహంతి లు ముఖ్యులు. ఇక కవయిత్రుల విషయానికి వస్తే మనోరమా మహాపాత్ర భీస్వాల్, ప్రతిభా సత్పతి, బ్రహ్మోత్రి మొహంతి, సుచేత మిశ్రా, లాట్నీ వాళ్ళు విరివిగా రాశి ఒడియా కవిత్వాన్ని నిలబెట్టారు.

ప్రధానంగా ఒడియాభాషలో రాసేవాళ్లే కాకుండా ఆ రాష్ట్రం లో ఇంగ్లీష్ భాషలో కవిత్వం రాస్తూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జయంత్



మహాపాత్ర లాంటి వాళ్ళు వున్నారు. జయంత్ మహాపాత్ర ఇంగ్లీష్ తో పాటు ఒడియాలో కూడా గొప్ప కవిత్వం రాశారు రాస్తున్నారు. దేశం మొత్తమ్ మీద అత్యంత గౌరవప్రదమయిన కవిగా జయంత్ మహాపాత్ర పెరుగడించారు.

ఒడియాకు చెందిన కవులు రాసినకవితలకు నేను చేసిన కొన్ని అనువాదాలు :

## కాలం ఎగిరిపోదు

ఎగిరిపోయేది కాలం కాదు
మనుషులు సమస్త జీవజాలమే
ఎగిరిపోతుంది.

నల్లటి కోటు తొడుక్కున్న మేఘం
రూప చిత్రం లా కూర్చున్న
నాన్నకు
వీడ్కోలు చెబుతూ ఎగిరిపోతుంది
నాన్న తల ఇంటి ముందున్న
వరండా గోడను
అసరాచేసుకుంటుంది
మరుసటి రోజు
ఆయన వెనుతిరిగి
అస్తమిస్తున్న సూర్యునితో పాటు
ఎగిరిపోయి క్షితిజం లో
చేరిపోయాడు.

రోదిస్తున్న వృక్షానికి వీడ్కోలు
చెబుతూ
ఆకులు రాలిపోతాయి.

కట్టెలు కొట్టేవాడొచ్చి
చెట్టును నరికేస్తాడు
తాను పుట్టి పెరిగి నిలబడ్డ నేలకు
వీడ్కోలు చెబుతూ చెట్టు నెలకు
ఒరుగుతుంది.

అకస్మాత్తుగా
ఇల్లూ, నదులూ,అడవులూ,
పొలాలూ, చిత్తడి నేలలూ
బంధువులూ
కాలం చిత్రించిన అనంతమయిన
చిత్రాలూ
నిశీధి లోకి కదిలిపోవడం
చూస్తాం

-ఒరియా మూలం ఇంగ్లిష్
అనువాదం: సీతాకాంత్ మహాపాత్ర
తెలుగు: వారాల ఆనంద్

ఒరియా కవిత

## ఒంటరితనం

నేను వింటున్న ఈ
ఒంటరితనం ఎక్కడుంది.
ప్రేమావకాశానికి అవతలా
కన్నీటి సరస్సు పైనా
లేదూ, మరణ భయం లోనా
. . . . . . . .
వదిలేసిన భవనం అన్ని మూలల్లో
హృదయం పై ముద్రితమయిన
సున్నిత పాద ముద్రల్లో.
చిత్తడి చిత్తడయిన
బూడిద నేలల అడవిలో.
నిశబ్దం శూన్య ఆకాశంలా
విశాలమయింది బలమయింది
కూడా.
బూడిద రంగు సూర్య కాంతిలో
ఓ పక్షి తన రెక్కల మీద
నీలి రంగు ముద్రలతో
గిరికీలు కొడుతున్నది.
సప్తస్వరాల్ని అవపోసన పట్టిన
చంద్రుడు
ఇంటి పైకప్పు పైకి పిలుస్తున్నాడ
ఇంత ఒంటరితనం
నా చెవుల్లో ఎట్లా నిండిం
చల్ల గాలి 'మహువా' వాసనల్ని
మోసుకొస్తున్నప్పటికీ
ఓ బలహీనమయిన గొంతు
నన్ను చేరుతున్న
ఓ సున్నితమయిన సూర్యోదయం
పట్టరాని కోపంతో
నన్ను నిద్రలేపుతున్నది.
ఒంటరితనంతో నాకిది
ఎక్కడి స్నేహం
నన్నెట్లా భగ్నం చేస్తుంది
ఇంకొకరి ఆధిపత్యాన్ని
తిరస్కరించే నన్ను
ఈ ఒంటరితనం
బంధించి వేస్తున్నది
ఒంటరితనం జవాబుల్ని ఆశించినప్పటికీ
నేను ప్రశ్నలు వేయను
నేనెప్పుడూ పిలవకున్నా
ఒంటరితనం
నా పక్కనే ఎదురుచూస్తూ వుంటుంది
నేను మాట్లాడను, అయినా
ఆరంభాన్నీ అంతాన్నీ
తెలుసుకోవాలనుకుంటాను
నన్ను భయమెందుకు పాలిస్తున్నది
నా జ్ఞాపకాల నెందుకు రేపుతున్నది
నా సాన్నిహిత్యాన్నెందుకు
ఆశిస్తున్నది

-ఒరియా : ప్రవాసినీ మహాకుద్
ఇంగ్లీష్: జయంత మహాపాత్ర
తెలుగు : వారాల ఆనంద్

ఒరియా కవిత

## 'అమ్మాయి సీతాకొక చిలుక'

నీ పిడికిట్లో ఏమి దాచావు
అత్యంత ఆసక్తితో అడిగింది
ఓ తల్లి తన కూతుర్ని
ఆ అమ్మాయి కళ్ళూ పెదాలూ
దేహం ముఖం
ఆమె కొంటె నవ్వును దాచలేక పోయాయి
నా పిడికిట్లో నీలం తెలుపు
సీతాకొక చిలుకను దాచాను
చూడు అంటూ పిడికిలి తెరిచింది
కానీ సీతాకొక చిలుక లేదు
ఉండాలమ్మా
నేనే తోటలోంచి తెచ్చాను
తల్లి తన హృదయపు లోతుల్లోంచి
గాఢమయిన నిట్టూర్పు విడిచింది
పాత కథే
అర్థంలేని నష్టం ఓటమి లొంగుబాటు
ఫలితంగా అలవికాని దుఖం
నేనుకూడా చూశాను తల్లీ కలల్లో
నీలం తెలుపు రెక్కల నడుమ
అమాయక పడుచుదనాన్ని
ఫెలుసయిన యవ్వనాన్ని
కానీ వాటిని ఆశించేందుకు
నాకు ధైర్యం లేక పోయింది
'అది నిన్నూ నాలాగే
శూన్య నేత్రాల్ని మిగిల్చి
ఎడారిగా చేసి ఎగిరిపోకుండా
నీ వేళ్ళను బంధించు '
అంది తల్లి కూతురితో
ఆశ్చర్యాద్భుతాలు నిండిన చూపులతో
కూతురు తల్లినే చూస్తూ వుండిపోయింది

ఒరియా మూలం:
ప్రవసినీ మహకుద్
ఇంగ్లీష్: ఏం. విజయలక్ష్మి
తెలుగు : వారాల ఆనంద్



## పలాయనం

నా లోపల ఓ పక్షి వుంది
నా చాతీ పంజరం కాదని
దానికి తెలుసు.
ఆ పక్షి ఎగిరినప్పుడల్లా
పాడుతుంది
దాని చిత్ర విచిత్ర చేష్టలతో
నన్ను దిగ్భ్రాంతున్ని చేస్తుం
అది అన్ని బంధాలనీ
అనుబంధాలనీ
తెంచుకుని ఎగురుతూ వుంటుం
అది ఎగురుతూ
లక్షల దీపాల్ని వెలిగిస్తూ
కల్లోల చీకట్లని చేధిస్తుం
అది ఎగురుతూనే వుంటుంది
కనుక
నాకూ హద్దులు లేవు.
నేను గాలిని వేదజల్లుతూనే
వుంటాను
ఃకానీ అది ఆరిపోదు
నన్ను కొలవడం
నా దేహం,కళ్ళూ,
ముక్కూ,పెదాల్నీ
మదింపు వేయడం
నీదెంత వృధా ప్రయాస

-ఒరియా మూలం: శర్మిష్టా
సాహు
ఇంగ్లీష్: జే.పీ.దాస్

## వర్షం

సరిగ్గా నిన్ను కలవడానికి
బయలుదేరే ముందు
వర్షం కురిసింది
వాన చినుకుల్లో తడిచి
నిన్నుఎట్లా కలవను?
తిరిగి వచ్చేసా.
వర్షం కురిసి
చాలా కాలమయింది
కానీ నువ్వు వెళ్లి పోయావు.
ఎముకల పొడిలాంటి
నా ఈ శరీరం మీద
ఇక
ఒక్క వాన చినుకయినా కురవదు

- ఒరియా మూలం
-ఆంగ్లానువాదం :
రమాకాంత్ రథ్

## చెత్తను ఏరి పారేద్దాం

చెత్తను ఏరి పారేద్దాం
రోజుల చెత్తయినా,
నెలల చెత్తయినా,
సంవత్సరాల చెత్తయినా
చెత్తను ఏరి పారేయాల్సిందే
ఇంట్లో అయినా ఒంట్లో అయినా
చెత్తా పేరుకపోతుంది
చెత్తను ఎప్పటికప్పుడు,
ఏరోజు కారోజు
ఏరి పారేస్తే ఇళ్లు శుభ్రం,
ఒళ్ళు శుభ్రం !
మనసుకు ఉల్లాసం !
వ్యవస్థలో సమస్త చెత్తలు
పేరుక పోయినందుకేగా
ఈ అనర్థాలు !
చెత్తను ఏరి పారేయడానికి
వాయిదాలు వెయ్యద్దు, నిర్లక్ష్యం చెయ్యద్దు
ఎన్నిరోజులు ఆగుతుంది,
ఎవరికోసం ఆగుతుంది చెత్త
కాలమో ప్రళయంమో వచ్చి,
తుఫానో, వరదో వచ్చి
చెత్తనంతా తుడిచి పెట్టుక పోతుంది
చెత్తతో పాచిపోయిన ఈ లోకాన్ని
ప్రకృతే ఒకింత
శుభ్రం చేస్తుంది అప్పుడప్పుడు
ఈ చెత్తను కూడా సమర్ధించే వాళ్ళు,
ఉండనీయమనేవాళ్ళు కూడా ఉంటారు
వాళ్లు చెత్తా మనుషులు !
మార్పును కోరని వాళ్ళు !
అప్పుడప్పుడు
సమాజంలో భరించరానంతగా
చెత్తా పేరుకపోతుంది
చెత్తని ఏరి పారేయడానికి కూడా
ఒకింత తెగువ, ధైర్యం కావాలి
అలాంటి రోజు కోసం
అలాంటి మనిషి కోసం చూద్దాం
స్వాగతం పలుకుదాం
చెత్తను ఏరి పారేద్దాం !



- డా. సబ్బని
లక్ష్మీ నారాయణ,
8985251271

## ఈత కొలను

సంతోషాన్ని తెచ్చి
ఒక్క చోట కుప్పపోసి
నింగి నుండి
నీలి రంగును తెచ్చి!.

వెన్నెల వెలుగులు
అద్దెకు తీసుకొని
నేల దోసిల్లలో
నిలువ ఉంచినట్లు!.

కొలనులో దూకాక
పిల్లలూ పెద్దలూ ఒకేతీరు
దుస్తుల్లో, దూకే ఉత్సాహంలో
కేరింతల అలలు సృష్టిస్తున్నారు!

స్వేదం చిందిన శరీరాలకు
సేద తీరే చల్లని కేంద్రాలు
వేడి వాడి తగిలిన మనసుకు
తడి తాకగానే ఆనందం!

మునగ మునగ కు
శరీరం తేలికయినట్లు
బిగపట్టిన శ్వాసతో
గాలిలో తేలుతున్నట్లు!

కాయానికి వ్యాయామం
మనస్సుకి వాహ్యాలం!
వేడిని ఒడ్డునపెట్టి
చల్లదనాన్ని ఒడిసిపట్టినట్లు!

సముద్ర, ఆకాశ విహారం
కలిపి నిజమైన కలలా
ఇలలో ఈత కొలను!!



-జగ్గయ్య.జి
9849525802

## తొలిమెట్టు తొలకరి చినుకు

చిన్నా రారా కన్నా రారా
గబగబ బడికి పరుగెడుదాం
చిట్టి రావే పొట్టి రావే
చకచక తొలిమెట్టెక్కేద్దాం

అ ఆ ఇ ఈ అంటూ మనమూ
అక్షరమాలను నేర్చేద్దాం
ఏ బీ సీ డీ అంటూ మనమూ
ఆంగ్లం అవపోసన పట్టేద్దాం
ఒకటీ రెండూ అంటూ మనమూ
ఓనమాల బండెక్కేద్దాం
ఆట పాటలతో మనమూ
ఆనందంగా చదివేద్దాం.

కథలు వింటూ కథలు చెప్తూ
ఊహాలలోకం విహరిద్దాం
బొమ్మలు గీస్తూ రంగులు వేస్తూ
కళలతో సావాసం చేద్దాం.

ముద్దు ముద్దు మాటలతో
మురిపెంగా భాషలో జీవిద్దాం
ధ్వని అక్షర గుర్తింపులతో
చదువుల లోకం ఏలేద్దాం
భాషాక్రీడల తొలకరిచినుకుల్లో
సంబరంగా తడిచేద్దాం
బడిబాటను పట్టి ప్రగతిని పొంది
సామర్థ్యాలను సాధిద్దాం

తొలిమెట్టు తోడుగ మనమూ
మలిమెట్టును దాటేస్తూ
విజ్ఞానపు వీధుల్లో
విలువల ఆధారంతో
చిరుదివ్వెలమై చిందులు వేద్దాం
భావితరాలకు వెలుగులు పూద్దాం



-అయిత అనిత
సెల్: 89853 48424.

# వెలుగులు విరజిమ్మే "దీపావళి"

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు పుట్టినిల్లు.ఎలాంటి జాతి ,మత, కుల ,వర్గ వివక్ష లేకుండా అందరూ సమైక్యంగా జరుపుకునే పండుగ. మన సంస్కృతికి ప్రతిబింబంగా ఉంటూ జగతిని జాగృతం చేసే ఈ పండుగ మానవ జీవితంలో వెలుగులు నింపేది .దీపావళి అంటే దీపాల వరస .చీకట్లను పారద్రోలి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రమిదలలో తైలం పోసి దీపాల వరుసను పెడతారు. దీపావళి ప్రతి సంవత్సరం అశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది.

నరకాసురుని మీద గెలిచిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటాం. ఆబాల గోపాలం కొత్త బట్టలు ధరించి గుమగుమలాడే పిండి వంటలు, టపాకాయల శబ్దాలతో ఆనందంగా జరుపుకునే పండుగ. నరకాసురుని సంహరించిన తర్వాత జరుపుకునేది దీపావళి అని మనకు ఇతిహాసం చెప్పిన కూడా , దీపావళి రోజే లక్ష్మీదేవి పుట్టిందని, లక్ష్మీ విష్ణువుల వివాహ దినం అంటూ ,రాముడు అయోధ్య చేరిన దినంగా ,పాండవులు అజ్ఞాత వాసం ముగించుకొని రాజ్యంలోకి




ప్రవేశించిన దినంగా రకరకాలుగా చెప్పుకుంటారు.

ఎంతో ప్రశస్తమైన దీపావళి పండుగ గురించి సంకలనం వెలువరించారు సరస్వతీ సంసేవక బిరుదాంకితులు శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్ గారు. వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది కవులతో "దీపావళి"( కవితా సంకలనం) వేయడం హర్షించదగ్గ విషయం. ఇందులోని ప్రతి కవితలు దీపావళి విశిష్టతను గొప్పతనాన్ని చాటిచెబుతాయి .అంతేకాకుండా కొంతమంది కవులు రకరకాల పద్యాలతో కూడా దీపావళి వెలుగులను వివరించారు.

**"దివ్య దీపావళి భవ్య దీపావళి**
**ఉల్లాస ఉత్సాహ ఉత్సవమని**
**మదిలోని చీకట్లు హృదిలోని చీకట్లు**
**తీసివేయునది దీపశ్రేణి"**

యనుచు డాక్టర్ రాపోలు సత్యనారాయణ గారు "దివ్వెల పండుగ" శీర్షికతో చక్కటి సీస పద్యంలో వివరించారు.

**"ఆశ్వయుజ అమావాస్య**
**అందమైన పండుగ**
**సౌభాగ్యం సౌజన్యం మన**
**దీపావళి పండుగ"**

అని షేక్ బాషా గారు

"దీపావళి నాడు- నేడు" కవితలో తన అంతరంగాన్ని ఆవిష్కరించారు.

**"చిచ్చుబుడ్లు కాకరత్తులు**
**లక్ష్మీ బాంబులు**
**అన్ని కన్నుల విందే**
**కానీ ఎక్కువైతే"** అని

సిద్దిపేట చెందిన మల్లెముల కనకయ్య గారు "దీపావళి" కవితలో తెలియజేశారు.

**"పాత సంప్రదాయం పొద్దున్నే లేచి**
**స్త్రీలు వాకిట్లో రంగవల్లు తీర్చిదిద్ది**
**పిల్లలకు నూనెలతో మర్దన చేసి**
**తలంటి స్నానాలు చేయించేవారు"**

దీపావళి పండుగ వాతావరణంను హైదరాబాద్‌కు చెందిన గజవెల్లి సత్యనారాయణ స్వామిగారు "చీకటి వెలుగులో" వివరించారు.

**"నాటి దీపావళి నేటి దీపావళి**
**తారతమ్యము చూడతరము కాదు**
**చక్కనాచరణంబు సాంప్రదాయములతో**
**ఉమ్మడి కుటుంబం ఉత్సవం"**

యనుచు సంపాదకులు శ్రీ చరణ్ దాసుగారు సీసమాలిక పద్యంలో "బంధు ప్రేమలు భారమయ్యే" అంటూ కన్నులకు కట్టినట్లు వివరించారు.

26 మంది కవులతో సంకలనం గా వచ్చిన దీపావళి కవితలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి వున్నాయి. చక్కటి పద్యములతో కవితలతో పాఠక ప్రియులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దబడినది .ఇలాంటి సంకలనాలు మరెన్నో సాహిత్య లోకానికి అందించాలని కోరుకుంటూ కవి , సంపాదకులకు శుభాకాంక్షలు.

పుస్తక ప్రతులకు:
వేముల శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్, భారత్ నగర్
సిద్దిపేట బి502103
చరవాణి :9652256429



-యాడవరం
చంద్రకాంత్ గౌడ్ ,
9441762105

పుస్తక సమీక్షలు

# బాల గంగాధరయ్య రచించిన మనోరంజక వ్యంజకాలు

తెలుగు సాహితీ ప్రక్రియలలో, సాహితీ కిరణం మాసపత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు సృష్టించిన వ్యంజకాలు, వినూత్న కవితా ప్రక్రియగా, పాఠకుల ఆదరణ పొందుతున్నాయి. సాధారణ మినీ కవితలకు విబిన్నంగా వాటి ప్రయోగంలో నూతనత్వం వుంది. కాని వ్యంజకం కనుమరుగైపోతే వాటి ప్రయోజనం, కవితా పరమార్థం సమజంగా, తెరమరుగైపోతుంది. శతాధికంగా వ్యంజకాలు, కవితలు రచించిన యం. బాలగంగాధరయ్య 'మనోరంజకాలు' అయిన 213 వ్యంజకాలను. సంపుటిగా ప్రచురింపచేసారు. చందస్సు అక్కర్లేకుండా తేలికైన మాటలతో, వర్తమాన సామాజిక సమస్యలపై స్పందించగలిగే భావ,






భాషా నైపుణ్యం వుంటేనే వ్యంజకం ఆకట్టుకుంటుంది. బాల గంగాధరయ్య వ్యంజక లక్షణాన్ని, పుణికి పుచ్చుకుని సాఫల్యం సాధించారని ఈ సంపుటి, స్పష్టం చేస్తోంది.

**'ఆకాశంలో మిలమిల మెరిసే చుక్కలు**
**నేలపై చిగురించే పచ్చని మొక్కలు**
**మబ్బులు కమ్మితే చుక్కలు మాయం**
**నీటి చుక్కలు ఎక్కువైతే మొక్కలు మాయం"** కరోనాపైన కూడా బాల గంగాధరయ్య వ్యంజక విసుర్లు రక్తి కట్టిస్తున్నాయి.

'చేయి చేయి కలుపుదాం హాయి హాయిగా
పార్కుల్లో కబుర్లు చెప్పుకుందాం తీయతీయగా
కరోనా సోకిందని చెప్పగానే
కనుచూపు కందకుండా పరుగో పరుగు"

ఈ సంపుటిలోని మరెన్నో వ్యంజక కవితలు పరిపూర్ణ లక్షణాలతో, ప్రతిభావంతమైన కొస మెరుపులతో న్యాయం చేస్తున్నాయి. కవి. రచయిత, ఎమ్. బాలగంగాధరయ్య అభినందనీయులు.

ప్రతులకు: ఎమ్. బాల గంగాధరయ్య, ఇ.నెం. 2-3-812
శ్రీ గణేశ్‌నగర్, నాగోల్
హైదరాబాద్.
సెల్: 9849546762



-జయసూర్య
సెల్:9014948336

## నేనింకా ఎవ్వరినీ ?

నగరమంతా నిద్రపోతుంది
చీకటి మాత్రం లెడ్ లైట్లతో
పగలను తలపిస్తుంది.

అడుగులు పడే బారుల దారిలో
ఎవరికీ వారు
గమ్యం చేరుకోవాలని
ఉబలాటం... నిత్య పోరాటం.

ఎన్నో వాహనాలు
రోడ్డును గాయం చేస్తూ
గేయాలు పాడుతూ
మస్తకపు మత్తులో తూలుతూ
ఊగుతూ తూలుతూ
కదలి పోతున్నారు.

అటు ఇటుగా కనబడుతున్న
అమాయక అబల కనబడగానే
లొంగ తీసుకోవాలని దుర్బుద్ధి
దాహార్తి తీర్చుకోవాలని చెడుబుద్ధి
పొరలలో వెలిగిపోతుంది.

అరుపుల మెరుపుల మాటున
మాటలను పెకల్చకుండా
శూన్య ప్రదేశంలోకి తోస్తారు
దేహాన్ని నాలుగు చేతులో బందించి
మనసును హారతి గావిస్తూ
తెల్లారని బతుకు తోటలో
పువ్వులను నలిపేస్తూ
ఆరాచక క్రీడా మైదానంలో
సుఖప్రాయాల బంతిని
సిక్సర్లతో ఆటలాడుతుంటారు.

తెలియని పైశాచిక ఆనందంతో
లోతులను తడుముతూ
లేతప్రాయాల గరిక పోసలను
నాశనం చేస్తున్నరు
అరచి అరచి కరిగిపోతున్న దేహం
కన్నీళ్లు ఏకరువు పెట్టిన దైనం

చెవిటి ప్రపంచానికి
వినబడదు కనబడదు
దండెం మీద
ఎండిపోయిన ఆస్థిపంజరంలా..
మర్మాంగాలు చిట్లిపోతున్న
రక్తం నదిలా ప్రవహిస్తున్న
గాజు పలకలా
హృదయం పగులుతున్న
నిశ్శబ్ద దాడికి లొంగిపోతున్నాయి
మానవత్వం
తోడేళ్ళ దాటికి నలిగిపోతుంది.

నేనింకా ప్రాణంతోనే ఉన్నాను
ఏవరైనా వస్తారని...ఆదుకుంటారని
నాకిప్పుడు భాషలేదు
నాకిప్పుడు ఆశలేదు
నాకిప్పుడు పుట్టుకలేదు
మీకు నేను మని'షీ'లా కనబడనపుడు
నేనింకా... ఎవ్వరినీ ?



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

## మైత్రి

హితాన్ని కోరి
రహస్యాలు లేని
భాషకు అందని
అపురూపం స్నేహితము
రక్తసంబంధం అక్కరలేదు
కులమతాలు అడ్డులేవు
ఆస్థి అంతస్తుల ఊసే లేదు
మంచి మాట చాలు
ఖండాంతరాలు దాటి
స్నేహం చేయ వచ్చు
కుచేల కృష్ణుడుల ఉండాలి
స్నేహం ముసుగులో మోసాలు
వద్దు
ఆనాడు కలం స్నేహం
నేడు ఫేస్ బుక్,ట్విట్టర్
ఇన్స్టాగ్రామ్ లలో మారె
అరె అని పిల్చుకుని
చిలిపిగా నవ్వుకొని
హాయిగా ఆయుష్షును పెంచుతూ
సజీవంగా పారే జీవనది
స్వాంతన చేకూర్చు
ఓదార్పు
మెరుపు
చేయూత
ఎదుగుదలను కోరుకునేదే
స్నేహం



-వి.శేషారావు
9440408080

## చీపురు.

పొల్లు రెల్లు వనాలవి..
నిరూపయోగ భూముల్లో
పురుడుపోసుకుంటూ..
అనాదలుగా జీవనంసాగిస్తూ
చూపుకు సైతం నోచుకోని
కసువు వనాలు..చీపురు వనాలు.
తాను నాటకపోయినా..
తాను సాకక పోయినా
అంతా తనదే అనే
మానవ నైజానికి చిక్కినాయేమో
చిక్కుతీసి తీర్చి దిద్దినందుకు
రుణం తీర్చుకోవాలని..
మానవ మనుగడకై
పారిశుధ్య బాధ్యత భుజానేసుకొని..
స్వచ్ఛ భారత్ అంటూ కదులుతూ..
స్వచ్ఛమైన హృదయాలను పరుస్తుంది..
చీపురు.
అతివల చేతిలో వయ్యారాలు పోతూ
గాజుల చేయి చూసి గారాలు పోతూ..
అతివ మెప్పుకై పనులు చక్కబెట్టి..
అవసరమైన వేళ
ఆమె చేతి ఆయుధంగా మారి
పరిస్థితుల దుమ్ము దులుపుతూ..
ఐకమత్యమే తన బలం మని
అదే తన సందేశమని..
గుర్తింపు కోరుకోని సైనికుల్లా..
ఆరోగ్య సిరులు కురిపించే సిరిమాలక్ష్మి..
పరిశుభ్రత యజ్ఞం కరుగుతూ
నిత్యావసర వస్తువులా మురిపించినా..
అవసరాల అనంతరం
ఒక మూలన ఒదిగే
శ్రామిక వర్గ ప్రతినిధి చీపురు..



-ఉదయశ్రీ ప్రభాకర్
9866687134

